విసవి

# మంచిగంధం మల్లెపూలు

బెజవాడ ప్లాట్‌ఫాం మీదకు ఏ రైలు ఎప్పుడు వస్తుందో ఏ రైలు ఎక్కడి కెళ్తుందో తెలుసుకోలేని పైతు మావయ్యలా ఐపోయాం మనవంతా. ఏకాలం వస్తోందో ఏకాలం వెళ్తోందో మనకేం పట్టదు.

జీతం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసినట్లు వసంతం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడం. బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడినట్లు ఋతువుల రాకకోసం నిరీక్షిస్తూ కూర్చోం. పంచదార కోటా వచ్చిందా

లేదా అని విచారిస్తాము. కాని అయ్యో హేమంతం వెళ్ళిపోతోందని విచారించం. పాలడబ్బాలు బ్లాకులో కొనక్కర్లేకుండా దొరికితే సంతోషిస్తాం కాని —

ఆకులు రాలిన
మ్రాకులతో, మణి
హారములు లూడ్చిన
నారీమణి వలె—

అతి సుందర మగు
ఋతువీ శిశిరము

అని శిశిరం వచ్చినందుకు సంతోషిస్తూ కూర్చోలేం కదా

హార్లిక్సు బాటిల్ కోసం కోపరేటివ్ స్టోర్సు చుట్టూ తిరగమంటే తిరుగుతాం కాని.

కోయని కూసెడి
కోయిల కొదమలు
బరా బరుల ద
ర్బారులు తీర్చిన

వనాధి దేవత
వసంత సుందరి.

అంటూ ఏ మామిడి తోపులోకో పోయి కూర్చోవాలంటే మనసొప్పదు. హాఫ్ డే క్యాజువల్లీవు పెట్టాలిసొస్తుంది "కోయని కూసెడి" కోయిలపాట వినడానికి. మణియార్డర్ కోసం పోస్టుమాన్ కి మ్రొక్కినట్లు

మామిడి కొమ్మమీద కలమంత్ర పరాయణులైన కోకిలస్వామికి మ్రొక్క లేం కదా!

మీకు జ్ఞాపకం వుందో లేదో- సైన్‌పూర్ రైల్వే కాలనీలో దారికిరు ప్రక్కలా వేసిన "యూక లిప్టస్ చెట్లు" తెల్లగా పాలరాతి బొమ్మల్లా వెన్నెట్లో ఆభరణాల్ని వొదిలేసి నవ్వుతూ నిల్చున్న అందమైన ఆడవాళ్ళలావుండేవి. యూరోపియన్ అమ్మాయిలు చెడ్డీలు వేసుకుని బీచ్చిలో "జలకాలాటలలో" పరుగెడుతూ అలసిపోయి నిల్చున్నట్లుఆ చెట్లు చూస్తుంటే రక రకాల భావాలు కలిగేవి. బెండువాల్చిన యూకలిప్టస్ చెట్లు మణిహారము లూడ్చిన నారీమణుల్లా కనిపించేవి. అప్పుడప్పుడు అవి ఠీవిగా నిల్చున్నట్లుగా రాజ కన్యల్లా నీలాకాశంలో తల ఎగరేస్తుండేవి. ఆ దారి తిన్నగా చెరువు దగ్గర కెళ్ళేది. ఆదారిని చేయిచేయి కలిపి నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ నడిచాము గుర్తుందా-దానిని మిల్కీ-వే అన్నారు. రాలిన పండుటాకులమీంచి నడుస్తుంటే అవి అరికాళ్ళతో గుసగుస లాడుతున్నట్లు చప్పుళ్ళయేవి. ఆ చెట్టు క్రిందనుంచి సిల్కు దుప్పటి పరిచినట్లు వెన్నెలలు పరుచుకుంటుండగా ఆ ఆకుల గుసగుసలు వింటూ చెట్టాపట్టా లేసుకొని తిరగాలనిపించడం తప్పా? నేను దానిని "లవ్వర్స్ పాత్. అంటే మీరు కాదు" మిల్కీ- వే అన్నారు.

ఇంట్లో కూర్చుని చాకిరీతో సతమతమయే ఆడదానికి కాలంలో మార్పులు గుర్తుపట్టాలంటే అసాధ్యమే. దోమలు నెత్తురు పీల్చేస్తుంటే వసంతం వచ్చిందో లేదో ఎవరికి గుర్తు? ఉత్తరాది వాళ్ళు కాస్త హోలీయేనా ఆడతారు.

బుక్కా చల్లుకోడం, గులామ్ చిమ్ముకోడం, పిచికారీతో రంగునీళ్ళతో పరుగెత్తుతూ తరిమి తరిమి కొట్టుకోడం మిఠాయిలు తినడం, పాటలుపాడుకోవడం యివన్నీ మనకులేవు. ఉన్నా నచ్చవు. నవ వసం

తగానముతో మనసు పరవశించేనే" అని సినిమాలో ఎవర్తో పాడుతుంటె నోరు వెళ్ళబెట్టుకుని చూస్తాం. రోడ్డు మీద మావిడికాయలు కుప్పలు పోయగా నేవచ్చే చైత్రమాసము వాసంత విలాసము అని తెలిసొస్తుంది.

మధ్యాహ్నం కాఫీకి పాలు విరిగిపోతాయి. మజ్జిగ పులిసి పోతుంది. పెరుగు పుల్లగా చిచ్చు లా తోడుకుంటే అప్పటికిగాని యిల్లాలికి తెలిసి రాదు. వసంతం వెైదొలగి నిప్పులు చిమ్మే గ్రీష్మం వస్తోందని. కాలవలు కట్టేస్తారు.

కొంపలంటుకున్నాయి. నీళ్ళు దొరక్క జనం మలమలామాడిపో తారు. ఎన్నిమార్లుస్నానం చేసినా తృప్తితీరదు. కాఫీ రుచించదు చల్లని దేదైనా పుచ్చుకోవాలనుంటుంది. బస్సులో చెమట. నడుస్తుంటే చెమట పది మందిలో కెళ్ళాలంటే విసుగూ- చిరాకు. కూరల ధరలు పెరిగిపో వడం. పాలవాళ్ళు వాడికలు ఎత్తేసి ఏడిపించుకు తినడం. వీధిలోకి అడుగు పెట్టాలంటే నెత్తి నేల మాడిపోవడం, ఇన్ని జరిగాక గాని ఎండా కాలం వచ్చినట్లు ఇల్లాలికి తెలియదు. పరుపులు చుట్టేసి ఎత్తి కట్టేసి ఓ జంబుఖానా. ఓ దుప్పటి ఓ తలగడా చాలు అనుకునే స్థితివచ్చేసరికి చల్లగా నేలమీద పడి దొర్లాలనిపిస్తుంది శరీరానికి. పిల్లలు నీళ్ళు పారబోసి బాత్ రూంలో చేరి తెగల్లరి చేస్తుంటారు.

ఎన్ని మంచినీళ్ళు తాగినా దాహం కట్టక పోవడం. చీటికిమాటికి వేడిచేసి తుమ్ములు దగ్గులు- డాక్టర్ల చుట్టూ తిరగడం యిన్ని జరిగితేకాని గ్రీష్మం పాదం మోపిందని ఎలా అను కోగలం.

పగటి సమయముల

ప్రచండ సూర్యుడు

నిశాసమయముల

ప్రశాంత చంద్రుడు—

కలిగిన చక్కని

కాలము గ్రీష్మము.

ఇంట్లో మగాళ్ళు ప్రచండ సూర్యుళ్ళా చండ్ర చండ్రం తీవ్ర తీవ్రంగా విజృంభిస్తే ఇల్లాళ్ళు ఐస్ క్రీం లాగయిపోయి ప్రశాంత చంద్రుళ్ళా ప్రసన్నంగా మారి చల్లనిచూపులతో తీయని మాటలతో మంటల్ని చల్లార్చాలి.

ఐస్ క్రీములు కూల్ డ్రింక్ షాపుల వద్ద రష్‌ను బట్టైనా రోడ్ల మీద పోసే మామిడికాయల గుట్టలను బట్టయినా శిశిర వసంతాలు నిష్క్రమించి గ్రీష్మం అవతరించబోతున్నదని అవలీలగా చెప్పొచ్చు.

స్వెట్టర్లు, బెంగుళూరు రగ్గులు, రొజాయిలు, పరుపులు గట్టిగా ప్యాక్ చేసి అటకెక్కించేసి ఏ దొడ్లో వేపచెట్టుక్రిందో మడత మంచం వాల్చుకుని వొంటిని పట్టినంత బట్ట మాత్రం చుట్టుకుని షర్బత్తులు తాగుతూ కమ్మని నవల చదువుకుంటే —

హాయి సఖీ బ్రతుకే, హాయినఖీ అన్నట్లుంటుంది.

తలుపులన్నీ గట్టిగా వేసేసి చీకటి చేసేసి కడుపునిండా భోంచేసి ఫాన్ వేసి పడుకుంటే ఈలోగా ఆడాళ్ళకు హరిమీద గిరి పడ్డా గిరిమీద హరి పడ్డా మెలకువ రాదు.

"తల్లో పూవులు సేరు" అన్నాడు కవి. ఒక్కొక్క అమ్మాయి సేరు సేరు పూలు పెట్టుకోవాలనిరూలు. మల్లెపూలు తెచ్చి యిల్లంతా చిమ్మేయండి. మెత్తగా పరిమళాలు వెదజల్లే సెంట్లు వాడండి. పునుగు

జవ్వాది గంధం తెచ్చి అట్టేపెట్టుకోండి. ఇంట్లో ఓరియంటల్ కాస్మెటిక్స్ వాడాలంటే సమ్మర్‌లోనే వాడాలి బుట్టలా తలపెంచుకొన్న మగాళ్ళను సెలూన్‌కి పంపి శుభ్రంగా చిన్న క్రాపుతో వస్తేనే యింట్లో తిండి పెట్టండి.

సమ్మర్ సుఖంగా గడిచిపోవాలంటే ఒంటి మీద మినిమం బట్టలుండాలి ఇంట్లో అన్ని బ్లయిండ్స్. చీకటిగా వుండాలి. ఫాన్ తిరుగుతూండాలి. నేలంతా తడిపేసి ఆ నీళ్ళలో తిరుగుతూ ఒక రికార్డు ప్లేయరుంటే సన్నగా వినిపించేలా ఓబడె గులామాలీఖానో రవి శంకర్ సితారో నాయుడి గారి పదేలో రాజేశ్వరరావు బాలసరస్వతి రికార్డులో వింటూ చల్లగాలిలో యమునాతటిపై తేలిపోవాలి. అంతేగాని ఒడియాలకు పిండి రుబ్బుతోనో, దిబ్బరొట్టెకాలుస్తోనో, గంజి వారుస్తూనో పైరికార్డులు వినకూడదు. మీవారి వొళ్ళోతలపెట్టుకుని మగతగా కళ్ళుమూసుకు పడున్నప్పుడెప్పుడైనా సైగల్ సోజారాజ కుమారి పాడేదా మీకోసం- అయ్యోపాడనేమూ! అయితే రాజేశ్వరరావు గార్నడగండి ఆయన చల్లగాలిలో పాడి మిమ్మల్ని నిద్ర పుచ్చుతాడు. గది మాత్రం చీకటిగా, చల్లగా వుండాలి. మీరొక్కరే ఎవర్నీ రానివ్వకండి మీ చీకటి గదిలోకి. అప్పుడు నాయుడిగారి "సోలో" వినండి లేదా సైగల్ని ప్రతిమాలండి దుఃఖకే పాడ్తాడు. ట్రయ్ అండ్ ట్రయ్ ఎగైన్ అన్నాడు కాళిదాసు. ఈ సమ్మర్లో ట్రయిచేసి చూడండి సంగీతానికి మీకూ విరోధం వుందేమో- బెస్ట్ ఆఫ్ లక్ .. టా....టా